సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 30 । మే । 2024



మితిమీరిన వేగం.. తీస్తోంది ప్రాణం

రెప్పపాటు కాలంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. మితిమీరిన వేగమే ఇందుకు కారణం. ఐదునెలల్లో సుమారు వందమంది మృత్యువాత పడ్డారు.

-8లో



కడప, నెల్లూరు జట్లు విజయం

కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో రెండో రోజున కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.250

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 780 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	330
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 16.720 కిలోలు

న్యూస్‌రీల్

373 మంది గైర్హాజరు

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షలకు 373 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. జిల్లాలో మొదటి సంవత్సరానికి 6158 మంది విద్యార్థులకు గాను 5861 మంది హాజరు కాగా 297 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1779 మంది విద్యార్థులకు గాను 1703 మంది హాజరు కాగా 76 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. స్క్వాడ్ బృందాలు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి ఆర్ కృష్ణయ్య పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

నేడు జిల్లాలో బీసీజీ వ్యాక్సినేషన్

రాయచోటి: జిల్లాలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టి, టీబీ నివారణే లక్ష్యంగా జిల్లాలోని అన్ని సచివాలయాలలో ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. బీసీజీ టీకాను 9 నెలల్లోపు పిల్లలకు ఒక డోసు వేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2025 నాటికి టీబీ నివారణే లక్ష్యంగా జిల్లాలో గత రెండు వారాలలో 21,404 వ్యాక్సినేషన్లను వేశామన్నారు. జిల్లాలో 4737 42 వ్యాక్సిన్లు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈనెల 30న అన్ని సచివాలయాలలో బీసీజీ వ్యాక్సిన్‌లను అందిస్తున్నట్లు వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ గురుకుల పాఠశాలలో 5,6 తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పెతకంశెట్టి సోమ సత్యశేఖర్ తెలిపారు. ముస్లిం మైనారిటీ, దూదేకుల విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు ఇవ్వాలని చెప్పారు.వివరాలకు 7780179446, 9059500173 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏసీఏ జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ నియామకం



విజయ్‌కుమార్

కడప స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024–25 సీజన్‌కు సంబంధించి జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ జిల్లాకు చెందిన పైడికాల్వ విజయ్‌కుమార్‌ను నియమించారు. నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి జారీచేశారు. ఈ నియామకం ఏడాది పాటు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా పైడికాల్వ విజయ్‌కుమార్ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్‌గా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా 27001 నుంచి 43 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 137 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం 43001 నుంచి 59000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లు, ర్యాంకుల పరిశీలన ఉంటుందని జ్యోతి తెలిపారు.

మామిడి.. తగ్గిన దిగుబడి

- ఒకసారి కాకుండా రెండుసార్లు పూత వచ్చినా ప్రయోజనం శూన్యం
- ప్రకృతితోపాటు అకాల వర్షాలతో మామిడి రైతుకు దెబ్బ
- కేవలం 10-20 శాతం మాత్రమే చెట్లపై కనిపిస్తున్న కాయలు
- జిల్లాలో 37 వేల హెక్టార్లలో సాగులో ఉన్న మామిడి పంట



చిన్నమండెం మండలంలో సాగులో ఉన్న మామిడితోట

సాక్షి రాయచోటి: ఈ ఏడు మామిడి దిగుబడి బాగా తగ్గింది. అకాల వర్షాలు, చలి, మంచుతోపాటు తెగుళ్ల దెబ్బ మామిడిపై ప్రభావం చూపింది. దీంతో మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు కష్టం నేలపాలై.. కన్నీళ్లే మిగిలాయి. అనుకున్న సమయంలో పూత రాకపోవడం..అటు, ఇటు కాని సమయంలో వర్షం కురవడంతోపాటు ప్రకృతి కూడా చలి, మంచు రూపంలో మామిడి రైతులను కోలుకోకుండా చేసింది. ఏటా జిల్లా నుంచి సుమారు రూ. 200 కోట్ల మేర మామిడిపై వ్యాపార లావాదేవీలు నడిచేవి. ఈ సారి సగానికి పైగా మార్కెట్ పడిపోయిందంటే జిల్లాలో మామిడి దిగుబడులు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల్లో పంట బాగా వచ్చినప్పటికీ స్థానిక మార్కెట్లలో మాత్రం మామిడికి డిమాండ్ ఏర్పడింది.

మామిడికాయలకు డిమాండ్

జిల్లాలో పండించిన మామిడి పండ్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. ఇప్పుడు కూడా రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లెకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కాయలను కొనుగోలు చేస్తుంటారు. ప్రధానంగా మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యాణ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి స్థానికంగా లాడ్జీలు లేదా ప్రత్యేకంగా రూములు తీసుకుని మూడు నెలలపాటు ఇక్కడే ఉండేవారు. కానీ ఈసారి మామిడికి సంబంధించి కాపు పెద్దగా లేకపోవడంతో వ్యాపారులు కూడా అంతంత మాత్రంగానే కనిపిస్తున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరు మార్కెట్ కాయలతో ఈ సీజన్ అంతా వ్యాపారులతో కళకళలాడేది.

చెట్లపై కాయలేవీ!



తోటలోని మామిడి చెట్ల వద్ద నిలబడిన రైతు పేరు బండి నాగేశ్వర. ఈయనది మండల కేంద్రమైన సుండుపల్లె. ఈయనకు 3.24 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం మామిడి తోటలో 14 ఏళ్ల వయస్సున్న ఇమామ్ పసంద్, నీలం, బెంగళూర, బేనీషా రకం చెట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది 10–12 టన్నుల దిగుబడి వస్తుండగా, ప్రస్తుతం కేవలం 1–2 టన్నులకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశాడు. సకాలంలో పేడ, రసాయనిక ఎరువులు అందించినా దిగుబడి మాత్రం పెద్దగా లేదు. చెట్లు మాత్రం లేత ఇగుర్లతో కళకళలాడుతున్నా పూత, పిందె లేక దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని దిగాలు పడ్డాడు.

జిల్లాలో మామిడి పంట సాగు: **37** వేల హెక్టార్లు

ప్రతి ఏడాది సాధారణ దిగుబడులు: **3** లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ప్రతి ఏడాది మామిడి లావాదేవీలు: రూ. **200** కోట్లు

ప్రస్తుత ఏడాది దిగుబడి శాతం: **10-20**

మామిడి సీజన్: ఏప్రిల్–జూన్ నెలాఖరు వరకు

భారీగా తగ్గిన దిగుబడులు

జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా లాల్ బహార్, బేనీషా, ఖాదర్, తోతాపురి, బెంగులూర, ఇమామ్ పసంద్, చెరుకు రసం, మల్లిక, సువర్ణ రేఖ, దసేరి, మల్లూబా తదితర రకాలు సాగు చేశారు. జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉండగా, అందులో 25 వేల హెక్టార్లలో కాయలు కాసే చెట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వచ్చేది. ఈసారి దిగుబడి 50–60 వేల మెట్రిక్ టన్నుల్లోపే వస్తుందని లెక్కలు వేస్తున్నారు. గతంలో ఎకరాకు పెద్ద చెట్లకు సంబంధించి ఐదారు టన్నుల దిగుబడులు వస్తుండగా, ప్రస్తుతం 1–2 టన్నులకే పరిమితమైంది.



రైల్వేకోడూరులో మార్కెట్‌కు చేరిన మామిడికాయలు

నిరాశాజనకం



ఈ ఏడాది మామిడికాయల వ్యాపారం ఏమాత్రం బాగా లేదు. 2023 సంవత్సరం లో 75 నుంచి 80 శాతం మామిడికాయలు కాసి మార్కెట్‌కు వచ్చేవి. ఈ కారణంగా కాయలను ఇతర రాష్ట్రాలకు 25–30 వేల టన్నుల కాయలను పంపేవారం. ప్రస్తుత ఏడాది 20 శాతం కాపు మాత్రమేవచ్చింది. ఈ కారణంగా 500–600 టన్నులు మాత్రమే పంపగలుగుతున్నాం. ధరలు ఉన్నా కాయలు లేని పరిస్థితి నెలకొంది.

– బెల్లం మోహన్‌రెడ్డి, మామిడికాయల వ్యాపారి, కొత్తపల్లి

డిమాండ్ ఉండే సమయానికి కాయలు రాలేదు



మామిడి కాయలకు మంచి డిమాండ్ ఉంది. అయినా కాపు లేదు. ఈ ఎడాది దిగుబడి చాలా తక్కువగా ఉండటంతో చివరి వరకు కాయలను కోయకుండా అలాగే ఉంచారు. వారం రోజుల క్రితం వీచిన గాలివానకు కాయలు కూడా రాలిపోవడంతో పాటు సీజన్ చివరికి చేరడంతో కాస్త డిమాండ్ పెరిగింది. బేనీషాలు టన్ను రూ.45 వేల నుంచి రూ.50 వరకు ధరలు పలుకుతున్నాయి. కానీ తోటల్లో కాయలు కనిపించడం లేదు. మొదటిలో కాయలు కోసినా డిమాండ్ లేకపోయింది. ఇప్పుడేమో ధరలు వచ్చేనాటికి కాయలు రావడం లేదు. గతేడాది కాయలు కాసినా లాభాలు రాలేదు...ఈ ఏడాది కాయలు లేకపోయినా ఎగుమతులు లేక ధరలు పలకలేదు.

– మదనపల్లె సతీష్ బాబు, మామిడి రైతు, వీరబల్లి మండలం

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్



కౌంటింగ్ కేంద్రం తనిఖీలో జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్, ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్ కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు వివరించారు. బుధవా రం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్ నుంచి రాష్ట్రంలో జూన్ 4న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫ రెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్‌కిషోర్, ఎస్పీ బి.కృష్ణారావులు హాజర య్యారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉందన్నారు. ఈ సెగ్మెంట్లకు రాయచోటి జిల్లా కేంద్రంలో ఒకే ప్రాంగణంలో పటిష్టమైన భద్రతతో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పుంగనూరు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ చిత్తూరు జిల్లాలో జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అసెంబ్లీ పార్లమెంట్ సెగ్మెంట్లకు 12 కౌంటింగ్ కేంద్రాలు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్‌కు విడిగా ఒక కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏర్పాట్లపై అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి పూర్తిగా తెలియజేశామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి ఇప్పటికే రెండు రౌండ్ల శిక్షణ పూర్తి చేశామన్నారు. మరొక దఫా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి నిద్ర కూడా చేస్తున్నట్లు చెప్పారు. గొడవలు చేసే వారిని, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ చేశామన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులలో నిఘా ఉంచామన్నారు. రిటర్నింగ్ అధికారులు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, రాఘవేంద్ర, లీలారాణి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

నిరంతరాయంగా కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు జరగాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కౌంటింగ్ కేంద్రమైన సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చే దారి, ఏజెంట్లు, సిబ్బంది వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్న బారికేడింగ్‌లలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. కౌంటింగ్ రూములలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల వీడియో ఫుటేజీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

క్షయను తరిమేద్దాం!



మనిషి ఆరోగ్యంపై కర్కశత్వంగా దాడి చేసే 'క్షయ' కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే ఈ వ్యాధి నివారణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోంది. పుట్టిన తరువాత పిల్లలకు ఎడమ వైపు భుజానికి 'ముద్ర' టీకాను వేస్తారు. ప్రస్తుతం పెద్దలకు సంబంధించి 'అడల్ట్ బీసీజీ' టీకా అందుబాటులోకి వచ్చింది.

- క్షయ నివారణకు 'అడల్ట్ బీసీజీ' టీకా
- ప్రస్తుతానికి 21,404 మందికి పైగా వ్యాక్సిన్
- సచివాలయాల్లో ఉచితంగా లభ్యం



బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ: టీబీ.. ఒకప్పుడు ఈ పేరు వింటేనే హడల్.. ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్దలకూ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూస్తే టీబీ మహమ్మారి వల్ల దేశాలకు దేశాలే కుదేలైన విషయాలు గుర్తుకొస్తాయి. ఏ వయసు వారికైనా సంక్రమించే అవకాశం ఉంది. ఇదొక అంటు వ్యాధి. కాగా ఈ జబ్బు నియంత్రణకు ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా నిర్ధారణ పరీక్షలతో పాటు వైద్య సేవలు అందిస్తోంది. దీంతో చాలా వరకు 'క్షయ' నియంత్రణలోకి వచ్చింది.

'ముద్ర' నుంచి 'అడల్ట్ బీసీజీ' వరకు...

ప్రభుత్వం టీబీ వ్యాధి నివారణకు ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. అందులో భాగంగా పుట్టిన పిల్లలకు ఎడమ వైపు చేతి భుజానికి 'ముద్ర' టీకాను వేస్తారు. తాజాగా ప్రభుత్వం పెద్ద వయసు వారికి సంబంధించి 'అడల్ట్ బీసీజీ' వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ టీకాను కుడివైపు చేతి భుజానికి వేస్తారు. కాగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 21,404 మందికి వైద్య సిబ్బంది టీకాలు వేశారు. మొత్తం 4,73,699 మందికి పైగా వ్యాక్సిన్ వేయడానికి వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఈ టీకాను అర్హులైన వారికి అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం ఏఎన్ఎం/ఎంఎల్‌హెచ్‌పీలు ఉచితంగా వేస్తారు.

వ్యాక్సిన్ పొందడానికి అర్హులు...

60 ఏళ్లు పైబడిన వారు.
- గడిచిన ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు.
- టీబీ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారు.

18 ఏళ్లు నిండిన వారిలో...
- పొగత్రాగే వారు..షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు
- బీఎంఐ 18 (అత్యంత బలహీనంగా ఉన్న వారు) కన్నా తక్కువగా ఉన్నవారు.

వ్యాక్సిన్ పొందడానికి అనర్హులు....
- ప్రస్తుతం టీబీ వ్యాధితో మందులు వాడే వారు.
- గర్భిణులు..పాలిచ్చే తల్లులు.
- హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు
- వ్యాక్సిన్ వేయించుకొనే సమయంలో జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారు.
- వ్యాక్సిన్ వేసినప్పుడు రియాక్షన్ వచ్చే వాళ్లు
- కిడ్నీ, లివర్, ట్రాన్స్‌ప్లాంట్ చేసుకొని మందులు వాడే వారు.
- రక్తదానం చేసిన మూడు నెలల వరకు..18 ఏళ్లు దాటని వారు టీకా వేసుకోకూడదు.

వ్యాధి కట్టడి లక్ష్యంగా....



క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా తొలిసారిగా 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ వ్యాక్సిన్ ప్రతి గురువారం హెల్త్ సెంటర్లలో వేస్తారు. సర్వేలో గుర్తించి వారంతా విధిగా ఈ వ్యాక్సిన్‌ను చేసకోవాలి. జిల్లాను క్షయ రహితంగా చేయడమే లక్ష్యం.

–డాక్టర్ శైలజ, జిల్లా క్షయ నివారణ అధికారి

మధ్యాహ్న భోజనంలో రాజీ పడొద్దు

డీఈఓ శివప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాజంపేట టౌన్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మరింత రుచిగా ఇంటిభోజనంలా ఉండే విధంగా ఉండాలని.. ఇందులో రాజీ పడకూడదని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ నిర్వాహకులకు వంటల తయారీపై శిక్షణ ఇవ్వడంతో పాటు వంటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పాల్గొని మధ్యాహ్న భోజనానికి సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. అలాగే వంటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన వంట ఏజెన్సీ నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్వాహకులంతా వంటలు తయారు చేయడంలో అనుభవం ఉన్న వారని, అందువల్ల కాస్త శ్రద్ధ పెట్టి వంటలు చేస్తే చాలా రుచిగా చేయగలరన్నారు. వంటలు రుచిగా చేయడంతో పాటు పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. బిల్లులు ఆలస్యం లేకుండా మంజూరవుతున్నాయని, అందువల్ల వంట ఏజెన్సీలు వంటల నాణ్యత విషయంలో రాజీపడకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతను పాటించాలన్నారు. వంట చేసే వారు వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు పాత్రలను నిత్యం శుభ్రపరచాలని తెలిపారు. మెనూ విధిగా పాటించాలని ఆదేశించారు. ఎవరైనా మెనూ పాటించకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు వయస్సుకు తగ్గ బరువు లేకపోవడం, ఎత్తుపెరగకపోవడం, రక్తహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు సుబ్బరాయుడు, నాగయ్య, జీ.చక్రధర్‌రాజు, కో–ఆర్డినేటర్ జిలానీ బాషా, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ముజఫర్ అహమ్మద్, రాజగోపాల్‌నాయుడు, పీ.సుబ్బలక్ష్మీ, ఏ.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు షెడ్‌లో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మదనపల్లె : పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డులోని కారు మెకానిక్ షెడ్‌లో బుధవారం వేకువ జామున అగ్నిప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప తెలిపారు. ఉదయం 4.30 గంటలకు విద్యోదయ స్కూల్ సమీపంలోని కార్ మెకానిక్ షెడ్‌లో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయని, సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేశామని తెలిపారు. అయితే అప్పటికే కార్ల టైర్లు, రేడియేటర్లు, బ్యాటరీలు, రిపేరీ పరికరాలు కాలిపోయాయన్నారు. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

రామాపురం : అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఎస్ఈబీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకుని రామాపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. మండలంలోని జాతీయ రహదారిపై ఆదర్శ పాఠశాల వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కువైట్‌లో పీలేరు వాసి మృతి



షేక్ సైషావలి మృతదేహం

పీలేరురూరల్ : బతుకుదెరువు కోసం పీలేరు నుంచి కువైట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పీలేరు పట్టణం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన షేక్ సైషావలి ఆరు నెలల కిందట బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లాడు. అనారోగ్యంతో బాధపడుతూ అక్కడే ఆస్పత్రిలో ఈ నెల 27న మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం పీలేరులోని వారి స్వగృహానికి మృతదేహం చేరుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య అమ్మాజి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రెప్పపాటు కాలంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. గంటకు 80–100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయడమే ఇందుకు కారణం. వేగాన్ని నియంత్రించలేక.. వాహనాలను అదుపు చేయలేక డివైడర్లు, ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ గ్రామీణ రహదారుల్లో అతివేగంతో నిత్యం ఐదారు ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని దుర్ఘటనల్లో వాహన చోదకులు ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. 18–60 ఏళ్ల మధ్య వారే అత్యధికం.

మితిమీరిన వేగం..

తీస్తోంది ప్రాణం



ఇటీవల గువ్వల చెరువు ఘాట్‌లో ఢీ కొన్న లారీలు



- చిన్నమండెం మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవగుడిపల్లె హరిజనవాడకు చెందిన నరసింహులు(35) మృతి చెందారు. స్థానిక గురు హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై నిలిపిన లారీని ఢీకొనడంతో గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.
- మదనపల్లె మండలం బురకాయలకోటకు చెందిన సాహెబ్ పీర్, హఫీజుల్లాతో కలిసి వివాహ శుభలేఖలు పంచేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వలసపల్లె పరిధిలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరితోపాటు మరో వాహనంలో వస్తున్న రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

- నిత్యం నెత్తురోడుతున్న రాష్ట్ర రహదారులు
- ఇంకొకరి నిర్లక్ష్యం... మరొకరికి ప్రాణ సంకటం
- ఐదు నెలల్లో వంద మందికిపైగా మృత్యువాత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసున్నాయి. సుమారు వందమంది మృత్యువాత పడగా 233 మంది క్షతగాత్రులయ్యారు. వాహనదారులు వేగం నియంత్రణ చేయలేకపోవడం, రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఆచరణ పెట్టకపోవడమే ఇందుకు కారణం. మదనపల్లి, యర్రగుంట్ల, కేవీ.పల్లె, కురబలకోట.. తదితర ప్రాంతాల్లో మితిమీరిన వేగం, మద్యం మత్తు, ఓవర్ టేక్, ఆకస్మాత్తుగా వాహనం నిలపడం, పరిమితికి మించి ప్రయాణం, రోడ్లకు అనుకొని, చెట్ల కింద ఆపడం వంటి కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. కొన్ని చోట్ల లారీలను హోటళ్లు, డాబాలు, ఇతర దుకాణాల వద్ద హైవేకు అనుకొని నిలిపివేస్తున్నారు. వెనుక వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించలేక వాటిని ఢీకొంటున్నాయి. క్లీనర్‌గా పనిచేసే వారు అప్పుడప్పుడూ వాహనాలు నడపడం, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక పట్టుకోల్పోయి ప్రమాదాలకు కాణమవడం జరుగుతోంది. ఫలితంగా ఎక్కువ మంది క్షతగాత్రులవుతున్నారు.

తీర్మానం చేసినా...

ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు జరిగే 70 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బ్యారికేడ్లు, రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు , సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీర్మానించారు. అది కార్యరూపం దాల్చినా.. కేవలం ఒకటి రెండు చోట్లకే పరిమితమైంది. అనంతరం అధికారులు అటు వైపు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా స్పదించాల్సిన అవసరం ఉంది. వాహన డ్రైవర్లను మేలుకొల్పేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించినపుడు కొంతమేర తగ్గముఖం పట్టాయి. అయితే కాలక్రమేణా ఆ కార్యక్రమానికి బ్రేక్ పడింది.

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 మే వరకు	214	100	233

ఇలా చేస్తే.. ప్రమాదాలకు చెక్

జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చూడాలి. రాత్రి వేళల్లో వాహన చోదకునికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేయాలి. వేగ నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతి వేగంతో దూసుకెళ్తున్న వాహనాలపై నిఘా కెమెరాలతో క్లాం వేయాలి. సంబంధిత వాహన యజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి. అనుభవం లేని డ్రైవర్లు నడపుతుంటే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ ధరించేలా చూడాలి. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి.

ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తాం



రోడ్డు నియమ నిబంధలను ఉల్లంఘిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నాం. మద్యం మత్తుల్లో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

రీ వాల్యుయేషన్‌తో మారిన అదృష్టం

– పది ఫలితాల్లో మండల టాపర్‌గా తౌసిఫా



నిమ్మనపల్లె : కష్టానికి తగిన ప్రతిఫలం లభించినప్పుడే ఎవరికైనా సంతోషంగా ఉంటుంది. ఓ విద్యార్థిని పది పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో రీ వాల్యుయేషన్ కోరగా అదృష్టం వరించింది. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని బోడుమల్లువారిపల్లె తౌసిఫా పది పరీక్షలు రాయడంతో అన్ని సబ్జెక్టుల్లో 98.97 శాతం మార్కులు వచ్చినప్పటికీ, సోషల్ సబ్జెక్టులో కేవలం 36 వచ్చాయి. ప్రిన్సిపల్ కే.ఎస్.ఎన్.మూర్తి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయగా, అనూహ్యంగా 96 మార్కులు వచ్చాయి. దీంతో మార్కులు 584కు పెరిగి మండల టాపర్‌గా నిలిచింది. పాఠశాల ఉపాధ్యాయులు తౌసిఫాను అభినందించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



పసుపులేటి శంకర్

నందలూరు : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నందలూరుకు చెందిన డాక్టర్ పసుపు లేటి శంకర్ పేరు నమోదైనట్లు హైదరాబాద్‌కు చెందిన కళానిలయం సాంస్కృతిక సేవా విభాగం నుంచి ఆహ్వానం అందింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 30న హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నారు. శంకర్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడి నివారణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, జాతీయ సమైక్యతతోపాటు ధార్మిక ఉపన్యాసాలు ఇస్తారు. ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడిగా, వైఎస్సార్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా, కడప రాజేశ్వరీ బీపీఆర్ భగవద్గీత సత్సంగం గౌరవాధ్యక్షుడిగా శంకర్ పనిచేశారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్ట్

మదనపల్లె : చేనేత కార్మికుడు చల్లా అశోక్ బాబు(34) ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ... చౌడేశ్వరీనగర్‌లో నివాసముంటున్న చల్లా అశోక్ బాబు, స్థానిక మగ్గాల యజమాని ఎరుకలరెడ్డి వద్ద పనిచేశారు. అశోక్ భార్య రెడ్డి రాణి ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోంది. ఏప్రిల్ 30న మగ్గం యజమాని ఎరుకులరెడ్డి, అతని అనుచరులు చలపతి, రాజేష్ తదితరులు చల్లా అశోక్ బాబుపై దాడిచేసి కొట్టారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అదడు మే 2న ఇంట్లోనే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుడు వీరభద్రం ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు... బుధవారం అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న నిందితులు ఎరుకలరెడ్డి(34), చలపతి(28), రాజేష్(29)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆటో బోల్తా – నలుగురికి గాయాలు





గాయపడిన పరిమళ, అఫ్రిన్

మదనపల్లె : ఆటో బోల్తా పడి నలుగురు గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. పట్టణంలోని రామగోపాల్‌నాయుడు వీధికి చెందిన పరిమళ(28), బాపూజీ పార్కు వద్ద టెంకాయల వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. బుధవారం ఆటో మాట్లాడుకుని తరిగొండకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఆటో బోల్తా పడి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పరిమళకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలో ఉన్న వాల్మీకిపురానికి చెందిన అఫ్రిన్(37), ఆమె భర్త బావాజాన్(39), కుమార్తె సుఫియా అంజుమ్(15) గాయపడ్డారు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిమళ పరిస్థితి విషమంగా ఉండడతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కడప, నెల్లూరు జట్ల విజయం



వంశీకృష్ణ, కడప (83 పరుగులు)



రేవంత్‌కుమార్, నెల్లూరు (81 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లా సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో రెండో రోజున కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. బుధవారం కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 310 పరుగులు చేసింది. టి.వంశీకృష్ణ 93 బంతుల్లో 83 పరుగులు, ఎస్.జహీర్‌అబ్బాస్ 31 బంతుల్లో 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 46.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అవడంతో కడప జట్టు 63 పరుగుల తేడాతో విజయం సాధించింది.

8 వికెట్ల తేడాతో నెల్లూరు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 42.5 ఓవర్లలో 161 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టు లోని యూఎంఎస్ గిరినాథ్ 44 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 21.5 ఓవర్లలో 165 పరుగులు చేసి విజయం సాధించింది. కె.రేవంత్‌కుమార్ 63 బంతుల్లో 81 పరుగులు చేశాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 55 బంతుల్లో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన వెంకటరమణ

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. నిమ్మనపల్లె మండలం పెద్దమాదిగపల్లెకు చెందిన బేల్దారి మేస్త్రీ కె.వెంకటరమణ(42), మదనపల్లెలో జరిగే గంగమ్మ తిరుణాలకు వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంలో బంధువుల పిల్లలు భరత్(15), కృష్ణవంశీ(10)లతో కలిసి వస్తుండగా, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన కురబలకోట మండలం అంగళ్లకు చెందిన సోమశేఖర్‌కు ఫిట్స్ రావడంతో రోడ్డుపైనే పడిపోయాడు. దీంతో ద్విచక్రవాహనాన్ని అదుపుచేయలేక వెంకటరమణ వాహనంతో సహా కిందపడడంతో గాయాలయ్యాయి. అతడితో పాటుభరత్, కృష్ణవంశీలు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. దుబ్బిగానిపల్లెకు చెందిన చంద్రశేఖర్ భార్య భార్గవి(23) ఆరు నెలల గర్భిణి. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



స్కూటీ బొలెరోలు ఢీకొన్న దృశ్యం (ఇన్‌సెట్) సహీనా(ఫైల్)

చిన్నమండెం : మండలంలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ సహీనా(53) మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. మదనపల్లి నుంచి సద్దలగుట్టపల్లికి స్కూటీలో సహీనా, ఆమె కుమార్తె సబీన్‌తాజ, మనువడు అబ్దుల్‌రెహమాన్ వెళ్తున్నారు. బెంగళూరు నుంచి రాయచోటికి వస్తున్న బొలెరో వాహనం స్కూటీని ఢీకొనడంతో కిందపడి సహీనాకు తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లి : గాలివీడు, రామాపురం మండలాల్లోని వేర్వేరు ప్రాంతాలలో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. గాలివీడు మండలం గరుగుపల్లె క్రాస్ వద్ద ఒక ట్రాక్టర్, ఆవులవాండ్లపల్లె క్రాస్ వద్ద మరో ట్రాక్టర్, రామాపురం మండలం ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఇంకో ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ ఎస్ఐ కామేశ్వర నాయుడు, ఎక్సైజ్ ఎస్ఐ జబీఉల్లా, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ–హుండీ ధ్వంసం





బీరువా పగులగొట్టి చిందర వందరగా పడేసిన దుస్తులు, ఆలయం వెలువల పడేసిన హుండీ

పెద్దతిప్పసముద్రం : గుర్తుతెలియని దుండగులు ఆలయాల్లో చోరీకి తెగబడ్డారు. హుండీలో నగదు, విగ్రహాలకు అలంకరించిన వెండి సామగ్రి దోచుకెళ్లారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కమ్మచెరువు వద్ద రెండు ఆలయాల్లో దొంగలు చొరబడ్డారు. ముందు శివాలయంలోకి చొరబడిన దొంగలు బీరువా పగలగొట్టి ఏమీ దొరకకపోవడంతో చిందరవందర చేసి వెళ్లిపోయారు. అనంతరం గొల్లపల్లి సందేశ్వరస్వామి ఆలయం తలుపు పగలగొట్టి వెండి మూల విగ్రహం, గణపతి, గణపతి ప్రభావళులు, ముఖ కవచం దొంగలు అపహరించుకెళ్లారని, వాటి విలువ రూ.9 లక్షలు ఉంటుందని పూజారి నారాయణస్వామి తెలిపారు. గత నెల 29న దేవర జరగడంతో పెద్ద మొత్తంలో భక్తులు డబ్బు హుండీలో వేశారని, దుండగులు పగలగొట్టి అందులో డబ్బుతో ఉడాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతాలను ఎస్ఐ రవీంద్రబాబు పరిశీలించి క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాలకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

ఖజానా కుంభకోణంలో మరో అడుగు

- అడిషనల్ డైరెక్టర్ సురేంద్ర విచారణ
- త్వరలో క్షేత్ర స్థాయిలో బృందం పర్యటన



తంబళ్లపల్లె ఉప ఖజానా కార్యాలయం

బి.కొత్తకోట : ఖజానా శాఖ కుంభకోణంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు విచారణ వేగవంతమైంది. ఈ కేసులో ఉన్నత స్థాయి విచారణకు ఆ శాఖ డైరెక్టర్ మోహన్ రావు ప్రత్యేక బృందం నియమించారు. జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, వాయల్పాడు, పీలేరుల్లోని ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో 2022 అక్టోబరులో వెలుగుచూసిన కుంభకోణంలో అప్పట్లో జరిగిన విచారణ మేరకు ఎస్టీఓలను విధుల నుంచి సస్పెన్షన్ చేసిన సంగతి విదితమే. కొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసారు. విచారణ మందగించడంతో సాక్షిలో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో ఖజానా శాఖ స్పందించి చర్యలు చేపట్టింది.

2022లో కేసు నమోదు

2022 డిసెంబర్, 13న తిరుపతి ఆదాయపన్ను శాఖ అధికారి రాజశేఖర్ మదనపల్లె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు పలువురిని అప్పట్లో అరెస్టు చేయగా, కేసు తీవ్రత దృష్టిలో పెట్టుకుని అప్పటి ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీకి అప్పగించారు. ఏడాదిగా ఈ కేసు కొలిక్కి రాలేదు. తాజాగా అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల పరిధిలోని ఉద్యోగులు చెల్లించిన పన్నుల రీఫండ్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలని ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతస్థాయి విచారణ బాధ్యతలను అడిషనల్ డైరెక్టర్ సురేంద్రకు అప్పగించారు. ఆయనతోపాటు బృందంలో ఆరుగురు సీనియర్ అధికారులను నియమించారు. ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో అక్రమాలు, బోగస్ పాన్, టాన్, ఏఐఎన్ కార్డుల ఆధారంగా అధికంగా రీఫండ్ వచ్చేలా చేశారు. ఆ మొత్తం ఎన్ని కోట్లలో ఉంటుంది, ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న అధికారులే బాధ్యులా? ఇంకా ఎవరెవరున్నారు? అనే వివరాలతో నివేదిక సిద్ధం చేయనున్నారు. క్షేత్ర స్థాయిలో ఈ బృందం త్వరలోనే కార్యాచరణ ప్రారంభించనుంది.

ఇతర ప్రాంతాల్లో విచారణ గాలికి

రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొన్ని ప్రాంతాలకే పరిమితం చేసారు. ముగ్గురు అధికారులు, ఒక ఆడిటర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఫిర్యాదులో పేర్కొన్న మేరకు ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టలేదు. రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదులో తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు సహా ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని ఇతర చోట్ల, ఏపీలోని కొన్ని జిల్లాల్లో ఈ రీఫండ్ కుంభకోణం ప్రమేయంపై విచారించాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు ఇక్కడికే పరిమితమైపోయింది. ఎన్నికల నేపథ్యంలో మదనపల్లె డీఎస్పీ బదిలీ అయి కొత్త డీఎస్పీ రావడంతో దర్యాప్తుపై ప్రభావం చూపిస్తోంది. జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించాల్సిన కేసు కావడంతో ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది.

షోకాజ్‌తో వదిలేశారా

రాయచోటి, తంబళ్లపల్లె, మదనపల్లె, వాల్మీకిపురం ఎస్టీఓలను, చిత్తూరుజిల్లా పుంగనూరు సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెన్షన్ చేసిన ఉన్నతాధికారులు మిగిలిన వారిపై చర్యలు తీసుకోలేదు. ఉద్యోగుల పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్)తోనే కాకుండా సంస్థల లావాదేవీల కోసం వినియోగించే టాన్ (ట్యాక్స్ కలెక్షన్‌అకౌంట్ నంబర్)తోనూ రీఫండ్ పొందినట్లు నిర్ధారణయింది. ఈ టాన్ నంబర్‌తో ఒకరికంటే మించిన ఉద్యోగుల పేర్లతో రీఫండ్‌కు ఫైల్ చేసినట్లు భావిస్తున్నారు. రీఫండ్ వస్తుందని కొందరు ఆడిటర్లు ఆశ చూపడంతో 24–జీ స్టేట్‌మెంట్ ఫారంలో వివరాలిచ్చారని తెలుస్తోంది. ఖజానా అధికారులు, ఆడిటర్లతో కుమ్మకైన కొందరు ఉద్యోగులు కుంభకోణానికి పాల్పడినట్లు ఖజానా శాఖ స్పష్టంగా చెబుతోంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరుజిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉప ఖజానా, జిల్లా స్థాయి అధికారులకు ఖజానా శాఖ డైరెక్టర్ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అనంతరం కనీస విచారణ కూడా జరగలేదని తెలుస్తోంది.

కుంభకోణంపై సమగ్ర విచారణ

కుంభకోణం వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపిస్తున్నాం. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక బృందం త్వరలో ఆయా ప్రాంతాల్లో పర్యటించి విచారణ చేపడుతుంది. ఇప్పటికే రీఫండ్ కుంభకోణంపై ఆదాయ పన్ను శాఖ నివేదికలు ఇచ్చింది. విచారణ అనంతరం వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు